స్కెచ్

# పెద్దా చిన్నా తారతమ్యం

అవసరాల రామకృష్ణరావు

"ఏమండోయ్ ఉత్తరం వచ్చింది" అని మా సుందరి ఆఫీసునించి రాగానే నాకొక కవరిచ్చింది. ఆ ఆఫీసుబట్టలు విప్పేసి మొహం కాళ్ళూ చేతులూ కడుక్కొని యిన్ని మంచి నీళ్లు త్రాగి సావకాశంగా కవరు చింపేను.

"ఎక్కడినుంచండీ ఉత్తరం?" అని అడిగింది సుందరి.

"ఆఁ, ఎక్కడినుంచీలేదు. మా నాన్నగారు వ్రాసేరు."

"ఏమంటారు? అంతా కులాసాయేనా? అత్తయ్యవంట్లో బాగుందా?"

"ఆఁ. అందరూ బాగానే ఉన్నారట. వచ్చే మంగళవారం మెయిల్లో మా తమ్ముడు మామగారు, నాల్గురోజులయి అక్కడ పని మీద వెళ్లేరుగా? ఆయన మళ్ళీ వచ్చేస్తున్నారట! అంతకన్నా విశేషాలు ఏంలేవు. అవును గాని బాజ్జీగాడెక్కడా అలికిడిలేదేం? ఈపాటికి ఇల్లెగరగొట్టేస్తూండేవాడు. ఏడీ?"

"ఇవాళ ఏ కళనున్నాడో పడుకున్నాడు...అబ్బబ్బ! వాడిని పడుకోబెట్టేసరికి పోయిన మా రంగయ్యతాతా వాళ్ళూ దిగొస్తున్నారు. ఇవేళైనా పంచదార తెస్తేగాని మిమ్మల్ని రేపు ఆఫీసుకి వెళ్ళనియ్యను."

"వెళ్ళనియ్యక ఏంచేస్తా వేమిటి?" అని నవ్వుతూ అడిగాను.

"ఏంచేస్తానో! అవును నా బాధ మీకేం తెలుస్తుంది? ఆ మధ్యాన్నం ఒక్కగంటా వాడిని మొగ్గలు వేయించో సర్కస్ చేయించో నవ్వుకుంటూ పెళ్ళికొడుకులా చక్కా పోతారు. మధ్యాన్నం ఓ అరగంటయినా పడుకోక పోతే యిక రాత్రి వాణ్ణి పాలు పట్టడానికి లేపేసరికి తాతలు దిగొస్తారు. మీకేం మీరు పడుకుంటే ఇంక ఏ లోకంలో ఉంటారో! ఇంక యెవరేడ్చినా ఏంచేసినా చలనముండదు. నిద్రలో సాక్షాత్తు మీ పుత్రుడే. చాలుగాని లేవండి."

నేను భోంచేస్తూంటే సుందరి పక్కని కూచునివిసురుతూ మాటాడుతూంది. "ఐతేఇప్పుడేమంటావు?" అన్నాను నేను కరివేపాకుపచ్చడి కలుపుకుంటూ.

"అబ్బే, అనడానికేముంది? మునుపు పెడమ్మ ఎంత నీళ్ళల్లాంటి పాలిచ్చినా యింత పంచదార వేస్తే బాజ్జీ ఇట్టే ఊదబట్టేసేవాడు. ఇప్పుడు ఎంతటి చిక్కని పాలిచ్చినా ఆ బెల్లపువాసన యిట్టే పోల్చేస్తున్నాడు! అంతదూరం నుండి విసిరి కొడుతున్నాడు. ఒక్కటే యేడుపు. మనం పెద్దవాళ్లమే వెధవ బెల్లంకాఫీ తాగలేక ఛస్తూంటే కుర్రవెధవ - అప్పటికీ నేను పంచదార వేసుకోకుండా యిన్నాళ్ళూ మిగిల్చాను. అదీ నాల్గురోజులయి ఐపోయింది."

సుందరి నా విస్తరివైపు చూసి "అయ్యో! అదేమిటండీ! అయిపోతే అడగరేం, కొంచెం పచ్చడి వెయ్యనా?" అంది. నేను తలవూపేను. సుందరి పచ్చడివేసి చెయ్యి కడుక్కొని యింత నెయ్యివేసి మళ్లీ కూర్చుంది.

"ఆ బెల్లమైనా శుభ్రమైంది దొరుకుతే కుర్రనాగమ్మ అంత అల్లరిపెట్టడు. వెధవబెల్లం! నారాయణ! తలుచుకుంటే ముద్ద దిగదు! మీ స్నేహితుడు అనకాపల్లినుంచి వస్తూంటే ఓ బెల్లందిమ్మ కొని తెచ్చిపెట్టమనండీ, ఎట్టాగా బావుంటుందని అంటే విన్నారూ?"

"బెల్లంబావుంటుందిగాని బెల్లం తెమ్మనడం బావుండదు" అని నవ్వి ఊరుకున్నాను.

అబ్బో, మీరెక్కడ మీకే తాపత్రయంవుంటే సంసారం యిలా తగులడునా?" అని సుందరి నామీద విరుచుకుపడింది.

"అయితే యిప్పుడేమంటావ్?" అన్నాను నేను చారూ అన్నం కలుపుకుంటూ.

"ఏమంటాను పంచదార తెమ్మంటాను. పంచదార లేకపోతే వాడు అసలు పాలు ముట్టుకోవడంలేదు. అల్లరికేం? యెలాగో తంటాలు పడతానుగాని వెర్రినాన్న నీరసంగా అయిపోతున్నాడు. అసలే తాగేవి పోతపాలు. అవీ మానేస్తే యింక అడగాలా?" సుందరి కంట్లోకి నీళ్ళొచ్చాయి.

నాకూ దుఃఖంవచ్చింది. ఇద్దరు పుట్టి పోయి నాక ఆనలుసు మాకు మిగిలాడు. వాడంటే మా యిద్దరికీ పంచప్రాణాలూను.

"నేను మాత్రం ఏం చెయ్యను చెప్పు? నాలుగుమాట్లు కలక్టరాఫీసుకి వెళ్ళేను. ఆయనగారి దర్శనమే కాలేదు. ఆయన పెర్మిట్ రాయడం ఎప్పుడు మనకి పంచదార వచ్చేదెప్పుడు?" అన్నాను.

"పోనీ ఓ పని చేస్తే?" అంది సుందరి.

"ఏమిటి?"

"మీ వూరిలో పంచదారకి రేషన్ వుందా?"

"ఉంది. రేషన్ లేనిదెక్కడ?"

"అదికాదు. ఇంత ఇబ్బంది వుందా అని!"

"లేదులే ... మా యింట్లో వాళ్ళందరూ పంచదారే వేసుకొని తాగుతున్నారు."

"అయితే ఓ పని చెయ్యండి-మీ నాన్నగారికికూడా బాబ్జీ అంటే పంచ ప్రాణాలు. ఇలా వున్నాడని వ్రాస్తే తప్పకుండా ఇంతో అంతో పంచదార పంపుతారు. కొన్నాళ్ళ యిబ్బంది లేకుండా గడిచిపోతుంది."

"అవున్లే. ఇప్పుడంత దూరంనించి ఎవరొస్తారని?"

"అయ్యో మరుపా! ఇందాక నేగా చదివారు, మీ తమ్ముడుగారి మామగారొస్తారని! ఆయనచేత పంపమని రాయండీ! ఏం, ఈమాట బాగులేదూ?"

"ఎలాగైనా ఆడవాళ్ళకి, మొగాళ్ళకన్నా ఉపాయాలు త్వరగా తడతాయిలే" అన్నాను నేను.

భోంచేసి నడవలో ఉయ్యాలలో పడుకున్న బాబ్జీని చప్పుడు కాకుండా ఓమారు ముద్దు పెట్టుకుని ఆఫీసు బట్టలు వేసుకుంటూ ఉంటే తమలపాకులు చిలకలు చుడుతూ సుందరి వచ్చింది,

"ఇదిగో-మరిచిపోయేరు గనుక! కార్డులు లేకపోతే మీ ఆఫీసు కుర్రాడిచేత తెప్పించుకోండి. తప్పకుండా వ్రాయండి. ఇవాళ పోస్టులోనే వెళ్ళిపోవాలి!" అంది.

నేను ఆకులూ. చెక్కలూ అందుకుని సుందరి బుగ్గపై ఒక్క చిటిక వేసి ఆఫీసుకు వెళ్ళిపోయాను.

ఉత్తరంవ్రాసి పడేసి వారం రోజులయింది. ఆవేళ మా ముకుందరావు మామయ్య వస్తాడని తెలిసికూడా ఆఫీసు పని ఎక్కువగా ఉండడంచేత స్టేషనుకు వెళ్ళలేకపోయాను. ఆవేళ పని అయిపోయిన తర్వాత వాళ్ళింటికి వెళ్ళాను. మా తమ్ముడు మామగారు ముకుందరావు వచ్చాడు. ఆ మాటా ఈమాటా అయినతర్వాత ఆయన 'బాబూ, మీ నాన్నగారు పంచదార ఇచ్చారు. సమయానికి వెధవలు ఏమైపోయారో ఇద్దరు బంట్రోతులూ లేరు. పెద్ద డబ్బాతో యిచ్చేర్లే. అంత నువ్వొక్కడివీ పట్టుకెళ్ళగలవా?" అన్నారు.

అసలే మాసిన బట్టల్తో బాధపడుతున్న వాడికి చాకలాడి దర్శనం అయినట్టు, నాకు సంతోషంతో మాట రాలేదు. ఆ తరవాత తేరుకొని 'అలాగే మామగారూ! మీ పని మనుషులు వొచ్చేకే పంపండి.' అనేసి ఇంటికి వచ్చి సంతోషిస్తుంది గదా అని సుందరికి చెబితే ఆవిడ ముక్కుమీద వేలేసుకొని 'అయ్యో మీ తెలివి తెల్లారా! మీకాపాటి పంచదారా బరువయి మరొకరికి పురమాయించి వచ్చారా? మళ్ళీ వాళ్ళచేతా వీళ్ళచేతా పంపేదాకా అది కూర్చుంటుందిటండీ! అసలే దొరకని వస్తువు! చాలు చాల్లెండి చేసేరు! వెళ్ళి వెంటనే తీసుకు రండి!" అని పంపించింది నన్ను.

నేను మళ్ళీ వెళ్ళేసరికి 'అయ్యో బాబూ! ఇప్పుడే రాముడిచేత పంపేశాను' అన్నాడాయన. చేసిన పనికి తల గోక్కుంటూ నే వచ్చేసరికి అప్పుడే వాళ్ల నూరమ్మ పంచదార ఇచ్చి వెళ్లి పోయిందిట.

రాముడిచేత పంపిన పంచదార నూరమ్మకెలా వచ్చిందో! ఏమో నాకెందుకు? ఎలాగో ఓలా పంచదార దొరికింది. అంతే చాలు అనుకున్నాను.

# మీ డబ్బును పెట్టుబడి పెట్టండి

| 3½% రాబడి పన్ను లేదు | భారత ప్రభుత్వపు పది సంవత్సరముల ట్రెజరీ సేవింగ్స్ డిపాజిట్ లో |
|---|---|

**భద్రతకు :**

డిపాజిట్లను బొంబాయి, కలకత్తా, ఢిల్లీ, మద్రాసు లలో గల ఇండియా రిజర్వు బ్యాంకులలోనూ, ఇతరత్ర ట్రెజరీ లావాదేవీలుగల ఇంపీరియల్ బ్యాంకు బ్రాంచీలలోను పుచ్చుకుంటారు.

**మంచి ప్రతిఫలానికి :**

వడ్డీని, సొమ్ము డిపాజిట్ చేసిన తేదీ మొదలు ప్రతి పన్నెండు నెలల కొకసారి సాలీనా 3½% వంతున అయిన వడ్డీ మొత్తాన్ని, ఏ ప్రభుత్వ ట్రెజరీనుండి అయినా పొందవచ్చును. లేక, డిపాజిట్ చేసిన ఆయన - ఆమె యొక్క విలాసానికి పబ్లిక్ డెట్ ఆఫీసు వారు పంపగలరు.

**మూలధనాన్ని సులభంగా తిరిగి పొందుటకు ;**

10 ఏళ్లు పూర్తి కాగానే డిపాజిట్ మొత్తాన్ని పొందవచ్చు కాని, అంతలోగానే అవసరమైనచో, డిపాజిట్ చేసిన ఒక సంవత్సరం తరవాత, ఎప్పుడైనా సరే, లాభసాటియైన డిస్కౌంట్ రేటువంతున, డిపాజిట్ కాలపరిమితిని బట్టి వృద్ధియైన నికర మొత్తాన్ని పొందవచ్చును.

## మీరు మరువవద్దు సుమండీ!

రాబడి పన్ను మినహాయింపు, డిపాజిట్లపై లభించు వడ్డీపై రాబడి పన్ను లేదు. రాబడి పన్ను లెక్కలకొరకు డిపాజిట్ దారు మొత్తం ఆదాయాన్ని లెక్కించునపుడు ఈ పైవడ్డీ మొత్తం అందులో చేర్చబడదు.
ఈ డిపాజిట్ను ప్రభుత్వంవారు ముందు ప్రకటించే తేదీవరకే పుచ్చుకుంటారు.

డిపాజిట్లను రు. 100 మొత్తాలలో క్రింద సూచింపబడిన గరిష్ఠ పరిమితులలో పుచ్చుకుంటారు.

రు. 25,000/- డిపాజిట్ దారు ఒక్కడే అయితే
రు. 50,000/- ఇద్దరుగా చేరియున్న లేక సంస్థల విషయంలో
రు. 1,00,000/- ధర్మసంస్థల విషయంలో

**జ్ఞాపకం ఉంచుకోండి:**
మీరు ట్రెజరీ డిపాజిట్ చేయడంతో మీ మూలధనాన్ని సురక్షితంగా చేసుకొనడంతోపాటు, 3½% వంతున, రాబడి పన్ను మినహాయించిన ఆదాయాన్ని పది సంవత్సరాలవరకు పొందుతామనే గట్టి నమ్మకం ఉంటుంది.

**—ఇప్పుడే డిపాజిట్ చేయండి—**

క్రింది వివరాలతో అర్జీ పెట్టుకోండి: మీ పూర్తి పేరు, విలాసం, డిపాజిట్ మొత్తం, ఒక్కరుగానీ, లేక జంటగానీ, వడ్డీని పొందగోరే ట్రెజరీ పేరు, లేక రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా వారిచే సొమ్ము పంపబడదగిన విలాసము: జంటగానైనచో మూలధనం చెల్లించబడు విధానము లేక, అప్లికేషన్ ఫారం పంపవలసినదని రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా వారికి, లేక మీకు సమీపంగానున్న ఇంపీరియల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచికి వ్రాసుకొనండి.

భారత ప్రభుత్వపు నేషనల్ సేవింగ్స్ కమిషనరు, ఆర్థిక మంత్రి కార్యాలయం, గోర్టన్, కాజిల్, సిమ్లావారి ప్రకటన

AC 232 TG

సుందరి ఆ పెద్దడబ్బా మూతతీసి నోరు నొక్కుకుని "ఏమండోయి మీరు నాలుగు వీశెలు పంపమని రాసేరా? ఇందులో రెండు వీశెలైనా వున్నట్టు కనపడదేం?" అంది.

"బాగుంది. వ్రాశాను గాని అడిగినంతా దొరకొద్దూ?" అని డబాయిస్తే ఏమనలేక ఊరుకుంది.

మా నాన్నగారి వుత్తరం చూసి నేనూ సుందరీ ఒక్కసారిగా ఆశ్చర్యపోయాం. ఆయన పంపింది ఆరువీశెలు! ఇంక చూసుకోండి మా సుందరి నృత్యం!

"నే మొదటే చెప్పలేదూ యిలా అవుతుందని? అంతట్లో బద్ధకమొచ్చేసింది అయ్యగారికి! ఆ కాస్తా యిక్కడ చేరిస్తే?- ఒకటా రెండా, నాలుగు వీశెల పంచదార! ఇంకా చూస్తారేమండీ? ఎవరు తీశారో కనుక్కోక!" అని జాడించింది.

తిన్నగా రాముడిదగ్గరికి వెళ్ళేను. "ఏమిరా? నీకు బాబుగారు శుక్రవారంనాడు పంచదార తీసుకు వెళ్లమని యిచ్చారా?"

వాడు అప్పుడే తెల్ల మొహంవేశాడు.

"మరి డబ్బా సూరమ్మ చేతికెలా వచ్చిందిరా?"

వాడు "సూరమ్మ యిల్లు కొత్తపేట వేపే కదూ...బరువు మొయ్యలేక ఎలాగా వెడుతోందికదా అని దానికిచ్చి ఇచ్చేమన్నాను బాబూ!" అన్నాడు.

సరే ఇది సూరమ్మ పనే అయి వుంటుందని దాన్ని అడిగాను. అది కంటనీరెట్టుకొని- "మా బుల్లోడికి మూడ్రోజుల ఏట్టీ జోరం బాబూ! యిన్ని కాఫీ నీళ్ళిత్తమంటే పంచదారలేదు. బాబూ ఒక వీశ పంచదార ఒల్లో యేసుకున్న మాట నిజమేబాబూ! చమించాల మారాజా!" అని కాళ్లట్టుకుంది.

దాన్నే మననూ?...దాని దీనవదనంలో కృత్రిమ ఛాయలు మచ్చుకైనా కనపడలేదు. మరి తక్కిన మూడున్నర వీశెలూ ఏమైనట్టు? రాముడిని దబాయించేను. వాడు మాత్రం ఓ పట్టాన వొప్పుకున్నాడా? "అంత పంచదార వుందికదా ఓ వీశన్నర తీస్తే పోయిందేమని తీసుకున్నాను బాబూ క్షమించాల"ని యేడ్చేడు. వాడిననేదేముంది?

మరి మిగిలిందేమైనట్టు! తిన్నగా ముకుందరావుగారింటికి వెళ్ళేను...

ఆయన."సందేహమేమిటి? ఆ వెధవలే తీసుంటారు! ఇంకా గట్టిగా అడగలేక పోయినావా బాబూ?" అంటూంటే వాళ్ల రంగడు"నాన్నా ఆ వేళ ఓ ఎర్రటి డబ్బాలోంచి మనం..." అంటూంటే, "ఛా నోర్ముయ్ వెధవకబుర్లూ నువ్వూను" అని ముకుందరావుగారు లెంపకాయ కొట్టేరు.

నామనస్సు మాత్రం చాలా బాధపడింది. సూరమ్మ దొంగతనం చేస్తే అర్థముంది. కాని కాని, బస్తాలకొద్దీ పంచదార నిలవచేసే ఆయనక్కూడా ఇంత కక్కుర్తి, ఇంతదొంగతనం - ఛీ...ఛీ...ఇతను మనిషేనా? యీ లెక్కని బియ్యంకూడానిలవచేస్తే మనుష్యులుబ్రతకాలా?

ఎందుకూ వెనకాల అనుకోడం? నేను ఎదురుగుండా ఒక్క మాటకూడా అనలేకపోయాను. మా సుందరి మాత్రం అలా వూరుకోనేరకంకాదు. ఏదోపనికట్టుకు ముకుందరావుగారింటికి వెళ్ళింది. ఆయన బ్లాక్ మార్కెట్టు గురించి పెద్దగా లెక్చరిస్తూంటే సుందరి అందుకుందిట.

"ఇంతెందుకు బాబాయ్! ఆ వూరినుండి వచ్చేసరికి మధ్యని సగం దొంగలు కదా! ఆనాటికి లేనివాడూ పరిస్థితులకి తాలుకోలేనివాడూ కక్కుర్తిపడితే అర్థముందిగాని, బోలెడేసి నిలవచేసే వెధవా చెయ్యిజాపడమేనా? సిగ్గుండొద్దూ? ఇలాంటి చీడ పురుగులుంటే దేశం బాగుపడుతుందంటూవా బాబాయ్?"

స్నానంచేసిన అగ్నిహోత్రుడికీ ముకుందరావుగారి మొహానికీ అట్టే తేడా లేకపోయిందని మా సుందరి ఇప్పటికీ చెప్తూంటుంది!

